# మరి ఈ ముసలాయన ఎవరు?

## గంటి రమాదేవి

మళ్లీ ఆ ఊరు వస్తానని అనుకోలేదు. ఫోర్తుఫాం చదువుతుండగా మా నాన్నగార్కి బదిలీ అయి ఆ వూరు వదలి వెళ్లిపోయాం. ఎలిమెంటరీ స్కూలునుంచి ఫోర్తుఫాం వరకూ అక్కడే వున్నానేమో, నాకదే స్వంత వూరనిపించింది. చిన్నప్పటి స్నేహితులు, వాళ్లతో ఆట పాటలు, స్నేహాలు, వైరాలు, తెలిసీ తెలియని వయస్సులో ఎడ్వంచర్స్‌లో థ్రిల్స్ స్పష్టంగా గుర్తున్నాయి.

కృష్ణ, నరసింహ, సుబ్బారాయుడు, రామమూర్తి, వామనుడు – మేమంతా ఒక బెంచిలో వరుసగా కూర్చోనేవాళ్లం. స్కూలు ముందు ''దేవుడి'' చెరువు. స్కూలు వెనకాల ప్లేగ్రౌండ్. ఆపైన ఈత చెట్లు. ఎడమప్రక్క వరిపొలాలు, పిల్ల కాలువలు, పొలం గట్లమీద కందిచెట్లు, బీరపాదులు, గుమ్మడి పాదులు, పసుపు పచ్చని పూలు, పచ్చగడ్డి, తడిసిన మట్టి, కాయగూర చెట్లు, పూలు, పిల్ల కాలువల్లో తిరిగే నీటి పాములు, పాము అడుగు భాగాన బంగారు పూతలు, పచ్చిచెట్ల మధ్య మా ఆటలు, ఇంటికి వచ్చి ఆవురావురుమని అన్నం తినడం, దీపం ముందు పుస్తకాలేసుకుని జోగుతూ నిద్రపోవడం – ఇవన్నీ ఒక క్షణం మనసులో మెదిలాయి.

కృష్ణ, నరసింహం, సుబ్బారాయుడు వాళ్లంతా ఇదే ఊర్లో ఉన్నారా? వాళ్లూ నాలాగే ఊరు విడిచి చెదిరిపోయారా?

బస్సు దిగి పరిసరాలు చూశాను. బస్సు స్టాండు మారిపోయింది.. పెద్ద కాలువ గట్టుమీద ''మేడా''వారి కొట్లముందుండేది బస్టాండు. ఊరికి దూరంగా మార్చారు. సూటుకేసు తీసుకుని వూరివైపు నడకసాగించాను.

శివుడి కోవెల చూడగానే ప్రాణం లేచొచ్చింది. గోపురాలకు వెల్లవేసినట్టున్నారు. మా కాలంలోలాగా వెలవెలపోవడం లేదు. పిచ్చికల వారి వీధిలోనుంచి మహంకాళి గుడి వీధిలోకి వచ్చాను. పదిహేనేళ్ళ క్రితం మనసులో ముద్రపడ్డ దృశ్యం, కంటికి కనిపిస్తూన్న ఇప్పటి దృశ్యంతో రాజీపడడం లేదు. వీధిలో నాలుగో ఇల్లుమాది. ఇంటి ముందు పెద్ద పెరడు. ఇంటి ముందు బాదం చెట్టు. చెట్టు క్రింద నుయ్యి. అది లేదు. ఆ ఇల్లు, ఆ చెట్టూ , నుయ్యి ఏవీలేవు. ఆకుపచ్చటి రంగు డాబా ఉంది. చుట్టూ ప్రహరీగోడ. అది మేము అద్దెకుండే ఇల్లు అయినా స్వంత ఇంటిలో ఉండే ఆత్మీయత, అధికారం ఏర్పడ్డాయి చాలా ఏళ్లు అదే ఇంట్లోఉండడం వల్ల. చివరి ఇల్లు సుబ్బారాయుడిది. భారంగా నడుచుకుంటూ సుబ్బారాయుడింటివైపు నడిచా ను. సుబ్బారాయుడు ఇక్కడే ఉన్నాడా? ఎలా ఉంటాడు? గుర్తుపట్టడం వీలవుతుందా?

సుబ్బారాయుడిల్లు శిథిలావస్థలోఉంది. తుప్పుపట్టినతాళం గుమ్మానికి వేలాడుతోంది! విరుగుతూన్న గోడలు, కూలుతున్న పెంకులు, వాడిక్కడ లేదు.

కన్స్యూమర్ ప్రోడక్ట్స్ రీసెర్చి బ్యూరో ఒక సర్వే నిర్వహిస్తోంది. దీన్లో సభ్యుడిగా వూరూరా తిరుగుతూ ఈ ఊరొచ్చాను. నిత్యావసర వస్తువులు, సబ్బులు, టూత్‌పొడర్లు, పేస్టులు, కాఫీ, టీ మొదలైన వాటి వాడకం తీరుతెన్నులు అంచనా వేస్తుంది సర్వే. ఇంటింటికీ వెళ్లి ప్రశ్నావళి ఇచ్చి సమాధానాలు వ్రాసుకోవాలి. క్రోడీకరించిన విషయాలు స్టాటిస్టిక్స్ బ్యూరోకి పంపాలి.

లాడ్జిలో సూట్‌కేసు పడేసి సర్వేపని మొదలుపెట్టాలి అనుకుని మెయిన్‌రోడ్డులో ఉన్న అన్నపూర్ణ లాడ్జిలోకి నడిచాను. రూములో సూటుకేసు పడేసి మళ్లీ రోడ్డున పడ్డాను.

హఠాత్తుగా లెక్కల మాష్టారు గుర్తుకొచ్చారు. చదువుకునే వయస్సులో పిల్లలకు పరిచయమయ్యేది ఉపాధ్యాయులే. ఆ చిన్న వయస్సులో మరే పెద్దమనిషితోనూ అంత సాన్నిహిత్యం ఉండదు. స్కూల్లో, ట్యూషన్లో, పరీక్షలలో ఎక్కువ తారసపడేది ఉపాధ్యాయుడే. మేష్టారు లెక్కలు బాగా చెప్తారని అక్కడ ట్యూషన్ కుదిర్చారు నాన్నగారు. నరసింహం, నేనూ, సీత, శారద, పార్వతి ఒక గ్రూపులో లెక్కలు చెప్పించుకునేవాళ్లం. సీత, శారద, పార్వతి ఎంత బావుండేవారని! పార్వతి నిగనిగ లాడుతూ వుండేది ముద్దొచ్చే బుగ్గలతో. కొంచెం నలుపు. శారద తెల్లగా ముత్యంలా ఉండేది. నడక, మాట మెత్తన. సీత కళ్లు ఆర్చిప్పల్లా పెద్దవిగా ఉండేవి. నేను వాళ్ల ముగ్గుర్నీ ప్రేమించాను – (అలా అనుకునేవాడిని). మనసులో ప్రేమించడం తప్పితే ఏం చేయాలో తెలిసేదికాదు. ఆ వూరు విడిచిపెట్టిన తర్వాత వాళ్ల ముగ్గురుని మర్చిపోలేకపోయాను. క్రమంగా అందర్నీ మర్చిపోయాను. వాళ్లను ప్రేమించానంటే నవ్వు వస్తుంది ఇప్పుడు. వాళ్ళు ముగ్గురూ నా కన్నా ఒకటో రెండో ఏళ్లు పెద్ద. రిక్షా కట్టించుకుని స్కూలుకెళ్లాను. ఇప్పుడది జూనియర్ కాలేజీ అయింది. స్కూలు ముందున్న శివుడి చెరువులేదు. పూడ్చేసినట్టున్నారు. ప్లేగ్రౌండ్ వెనుకవున్న ఈత చెట్లు అలాగే ఉన్నాయి. గ్రౌండు దాటి ఆ చెట్లవైపు నడిచాను. చెట్లలో నుండి గుసగుసలాడుతూ పోతున్న గాలి. నిశ్శబ్దంలో, దూరంగా వినబడే మునివాటికల వేద ఘోషలా ఉంది. ఇదా మారలేదు. పచ్చటి పంటపొలాలు, కందిపూలు, బీరపూలు, గుమ్మడి పూలు, జనపచేలు ఇవి మారలేదు. సూర్యకాంతి చారలు చారలుగా నేలమీద పడుతోంది. ప్రకృతి జోలికి మనిషి పోకుండా వుంటే చాలు. తరతరాలు మార్పులేకుండా అలాగే వుంటుంది.

స్కూలు గేటు దాటి ముందుకొస్తుంటే బెల్లు మ్రోగింది. పరుగెత్తుతూ పిల్లలు ఇళ్లకి వెళుతున్నారు. కాలేజీ పిల్లలు స్టయిల్‌గా నెమ్మదిగా వెనకాల నడుస్తున్నారు పరుగెడుతున్న పిల్లల్ని చులకనగా చూస్తూ. నరసింహం ఇంటి వైపు వెళ్లాను. వాకబు చేశాను. ఆ ఇంట్లో ఉండేవాళ్లు నరసింహం పేరు విననట్టు చూశారు. రామ్మూర్తి ఇంటి కెళ్లాను. ఓ ముసలావిడ (తల్లేమో ఇదివరకెప్పుడూ చూడలేదు)

> నరసింహం, నేను, సీత, శారద, పార్వతి ఒక గ్రూపులో లెక్కలు చెప్పించుకునేవాళ్లం. సీత, శారద, పార్వతి ఎంత బావుండేవారని! పార్వతి నిగనిగలాడుతూ వుండేది ముద్దొచ్చే బుగ్గలతో కొంచెం నలుపు. శారద ముత్యంలా ఉండేది.

రామ్మూర్తి ఎక్కడో ఉత్తర హిందూస్థానంలో ఉన్నాడని చెప్పింది. కృష్ణ ఇంటికి వెళ్లాను. ఏదో వూరిపేరు చెప్పారు వాళ్లింట్లో. నామనుమడు ఇంటికెళ్దామనిపించలేదు. నేను వస్తున్నట్లు వాళ్లకేమైనా తెలుసా, కామకుర్రాళ్ళొస్తే నడానికి! జీవనయాత్రలో ఎవరి గమ్యం వారిది! ఎవరి వేగం వారిది!

ఆచంట వారి వీధిలోనుంచి వస్తూంటే నాకు తెలియకుండానే ఆగిపోయాను. గుమ్మానికానుకుని సీత నిలబడివుంది. అవే పెద్ద కళ్లు. అదే వంటి రంగు.

"సీతా!" అన్నాడు అప్రయత్నంగా. బిత్తరపోయింది సీత.

"గుర్తుపట్టలా" అని నా పేరు చెప్పాను.

"సీత మా అమ్మండీ! నా పేరు శాంతి..." అని "అమ్మా! అమ్మా! నీకోసం ఎవరో అబ్బాయొచ్చాడే అని అరిచింది.

అబ్బాయా! — నేను —

"ఎవరండీ" అంటూ వచ్చింది ఒకావిడ. లావుగా, వడలిన ముఖంతో, అక్కడక్కడ నెరిసిన జుట్టుతో, నడివయుస్కురాలైన సీత.

అప్రయత్నంగా అన్నాను.

"సీతగారూ!"

కొన్ని క్షణాల తర్వాత గుర్తుపట్టింది. నేను ఎక్కడుంటున్నదీ చెప్పాను. సీతకు నలుగురు పిల్లలట. పెద్దది ఆడపిల్ల. ముగ్గురు మగ పిల్లలు. నామనుమడు దుబాయ్ వెళ్లిపోయాట్ట. పాతకాలపు స్నేహితులెవరూ లేరు ఆ ఊర్లో. శారద, పార్వతి ఎక్కడున్నారో తెలియదంది.

"మన ట్యూషన్ మాష్టారుగారు ఎలా ఉన్నారు?" అడిగాడు బయటకొస్తూ.

"నాకూ అంత తెలియదు. ఆ మధ్య మార్కెట్‌లో చూశాను. మనిషి చాలా పాడైపోయారు" అంది.

లాడ్జికొస్తూ ఆయన గురించే ఆలోచించాను. తెల్లవారిన తరువాత వెతుక్కుంటూ వెళ్లాను. నల్లేరువారి వీధి పెద్దగా మారలేదు. ఆయన ఇల్లు గుర్తుపట్టాను.

"మేష్టారుగారి ఇల్లు ఇదేనా" అని అడిగాను ప్రక్కింటాయన్ని.

నాకేసి ఓసారి అనుమానంగా చూసి "నారాయణగారా?" అనడిగాడు.

అయితే ఇక్కడే ఉన్నాడన్న మేష్టారు అనుకుని "అవునండీ" అన్నాను.

ఇల్లు చూపించాడు.

తలుపులు వేసివున్నాయి. తట్టాను.

"ఎవరూ?" కర్కశంగా గొంతు వినబడింది. దభాల్న తలుపు తెరుచుకుంది.

"మేష్టారు లేరా?"

"విమలా నర్సింగ్ హోమ్‌లో..." ముఖంలో చిరాకు. బియ్యం గింజవేస్తే పేలాలయ్యేటట్టు ముఖం.

"నర్సింగ్ హోమ్‌లో ఉన్నారా"


"ఆ..."

నా ముఖం మీదే తలుపులు మూతపడ్డాయి. చిన్న బుచ్చుకున్నా, నా ముఖం చూసి అన్నాడు పక్కింటాయన.

"ఆయన మూడోవాడు. వీడికే కొంచెం దయా దాక్షిణ్యం ఎక్కువ. మిగిలిన ఇద్దరూ అసలు పట్టించుకోరు."

భారంగా అడుగులేసుకుంటూ లాడ్జివైపు నడిచాను. లాడ్జి కొస్తూవుంటే నారాయణగారి గురించే మళ్లీ ఆలోచనలు. ముగ్గురు కొడుకుల్లో ఏ ఒక్కరూ నారాయణగార్ని గూర్చి పట్టించుకోరా? కారణం? ఏమో? ముసలి జీవానికి సేవ చేయాలంటే బోల్డు టైము వేస్టు. బోర్! అంత ఓపికెవరికి! "చాదస్తంగా 'ఏదో'వాగుతుంటారు ఈ ముసలాళ్లు" అన్న మాటలు





బోలెడుమంది నోటివెంట విన్నాను. నారాయణగారి కొడుకులూ ఆ కోవలోని వాళ్లే? లేదా అప్తితగాదాలు! లేక నారాయణగారి పద్ధతులు వీళ్లకు నచ్చకా? ఈ ప్రశ్నకు సమాధానాలు నాకు దొరకవు.

బస్టాండుకు దగ్గరగా ఉన్న విమలా నర్సింగ్‌హోమ్‌కు మర్నాడు వెళ్లాను. డ్యూటీలో ఉన్న నర్సును నారాయణగారి గురించి అడిగాను.

"టెర్మినల్ స్టేజీలో ఉన్నారు. చివరి రోజు."

"జబ్బేమిటి?" అడిగాను.

"వంట్లో ఏమీ లేదు. డిప్రెషన్. మానసిక వ్యథ.

బతకాలని ఆశ లేదు. సెనిలిటీ. ఏంక్సయిటీ...''

నాతో తీసుకెళ్లిన ఆపిలుపళ్లు ఇచ్చి, ఆయనకిమ్మన్నాను. నర్సు నవ్వింది.

''మామూలు ఆహారమే తీసుకోవడం లేదు. ఇవ్వండి...'' అంది సందేహిస్తూ.

''ఇవ్వండీ... మళ్లీ రేపొస్తాను''. అని తిరిగొచ్చేస్తుంటే నర్సు అంది.

''ఆయన ఐ.సి.యూలో ఉన్నారు. కావాలంటే చూడొచ్చు'' అంది. నాకూ చూడాలనిపించింది. స్వయంగా నేనే పళ్లుకూడా ఇవ్వవచ్చు.

మంచం మీద ఎముకల గూడులా పడివున్న నారాయణగార్ని చూసి గుర్తుపట్టలేదు. మగతగా పడివున్నారు. నర్సు తట్టిలేపింది. చెవిలో గట్టిగా చెప్పింది.

మీ గురించి ఎవరో వచ్చారు అని. ఆయన బలహీనంగా కళ్లు ఎత్తి చూశారు. నన్ను గుర్తుపట్టలేదు.

''మిమ్మల్ని చూద్దామని వచ్చాను... నేను...'' అని నా గురించి చెప్పాను.

బలహీనమైన ఆయన ముఖంలో కదలిక. ముఖం కండరాలు విపరీతంగా కదిలాయి. ఏదో చెప్పాలని ప్రయత్నం. కళ్లలో నీటిపొరలు.

నే తెచ్చిన పళ్లు ఇచ్చి బయటకు వచ్చాను.

సర్వేకు సంబంధించిన ప్రశ్నావళి తీసుకుని ఇల్లిల్లూ తిరుగుతూ సాయంత్రానికి నాలుగు వీధులు తిరిగాను. లాడ్జిలో స్నానం చేసి నర్సింగ్‌హోమ్‌కి వెళ్లాను. నారాయణగారి మంచం దగ్గరికి వెళ్లాను. ఆశ్చర్యం. ఆయన కళ్లు నిర్మలంగా ఉన్నాయి. బలహీనంతో మాట రాకపోయినా కళ్లతోనే ఏదో చెబుతున్నారాయన. ఆపిల్ పండులో ఒక ముక్క కొరికినట్టు గాటు పెట్టబడివుంది.

చాలాసేపు ఆయన దగ్గరే కూర్చున్నాను ఏదో మాట్లాడుతూ. నే చెప్పేది ఆయనకు ఒక్క ముక్క కూడా అర్థం కాదని తెలుసు.

రెండో రోజు వెళ్లడం ఆలస్యం అయింది. నన్నుచూడగానే నర్సు అంది ''ఆయన మీకోసం కలవరిస్తున్నారు'' అని. నారాయణగారు తలగడ వేసుకుని కూర్చుని ఉన్నారు. నన్ను చూడగానే కళ్లు తళుక్కున మెరిసాయి. మాటలు రాని నోరు ఏదో చెప్పాలని తహతహ లాడుతోంది. సీడ్‌లెస్ ద్రాక్షపళ్లు ఆయన కందించాను. ఒక్కొక్కటే అందుకుని తింటున్నారాయన నేనక్కడున్నంతసేపు. ఆయన మంచం విడిచి వచ్చేస్తూంటే పసిపిల్లవాణ్ణి తల్లి విడిచి వెళ్లిపోయేటప్పుడు కనిపించే దిగులు ఆయనలో కనబడింది.

నాకున్న పని దాదాపు పూర్తయింది. నాలుగో రోజు సాయంత్రం నర్సింగ్ హోమ్‌కు వెళ్లాను. నా కోసమే ఎదురు చూస్తోంది నర్సు. డాక్టరుగారు నన్ను చూడాలన్నారుట. డాక్టరు గదిలోకి వెళ్లాను.

నమస్కారం పెట్టి నేనెవరో చెప్పాను. నాకేసి పరీక్షగా చూసి ఆయన అన్నాడు.

''నారాయణగారు ఒకటి రెండు రోజులకన్నా బతకరనుకున్నాం. ఆయన ముగ్గురు కొడుకులూ నా మొహాన్న మూడు వేలు కొట్టి బతికినంత కాలం వుంచి తర్వాత బాడీని మీరే డిస్పోస్ చెయ్యండని వెళ్లిపోయారు. నిజానికి ఆయనది పెద్ద జబ్బుకాదు. మేం కూడా ఆ 'రోజు'కోసం ఎదురుచూస్తూ కూచోడం తప్ప ట్రీట్‌మెంటంటూ ఏంలేదు. నాలుగురోజుల క్రితం మీరొచ్చినప్పుడు ఉన్న తీవ్ర పరిస్థితి ఈనాడు లేదు. ఆకలేస్తోందని బ్రెడ్ పాలు తాగారు... రియల్లీ మిరాక్యులస్... ఆయన ప్రక్కన టెలిఫోన్ మ్రోగింది. ఆయన రిసీవర్ ఎత్తి 'హల్లో' అని ''ఊహూ... ఇంకా లేదు... నో... డబ్బేం వద్దు'' అని పెట్టేశాడు డాక్టర్.

''ఆయన కొడుకులు 'పోయారా' అని అడుగుతున్నారు. డబ్బు కావాలంటే పంపిస్తారుట''

ఆ రోజు నారాయణగారు నాతో మాట్లాడారు ఒకటి రెండు మాటలు. ''పళ్లు బాగున్నాయి'' అని.

పని పూర్తయినా, ఇంకో నాలుగు రోజులు పొడిగించాను.

నారాయణగారి ఆరోగ్యం చాలా చక్కబడింది. ప్రతిరోజూ వెళ్లి ఆయనతో లోకాభిరామాయణం మాట్లాడ్డం మొదలుపెట్టాను.

రెండు మూడు వారాల్లో ఆయన తేరుకుని మాట్లాడేవరకు రావచ్చని డాక్టరు చెప్పారు. ఇంకో ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే ఆయనకు శ్రవణ శక్తి వస్తోందిట. ఇప్పుడిప్పుడే మరి. ఇన్నాళ్లూ నేను మాట్లాడుతూంటే అర్థం అయినట్టుగా ముఖంలో కనుపించేది? భావం, భాష అర్థం కాకపోయినా, శబ్దం వినబడి వుండవచ్చు. అప్యాయంగా, ఆత్మీయంగా వినబడే గొంతుకు భాషేమిటి? భావం ఏమిటి? అయితే అంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం ఆ సాయంత్రం తెలిసింది.


సర్వే వర్క్ పూర్తయింది. సీత ఇంటికి వెళ్లి సెలవు తీసుకుందామని వెళ్ళాను. సీత భర్త ఇంట్లోనే ఉన్నాడు. ఆ రాత్రి భోజనం చేసి వెళ్లమని బలవంతం చేశాడు. సీత క్లాసుమేటని తెలియగానే తనకి థ్రిల్ అనిపించిందని చెప్పాడు. తాలూకాఫీసులో సీనియర్ క్లర్క్‌గా పనిచేస్తున్నాట్ట.

భోజనం వడ్డిస్తూ అంది సీత.

''నీకింకా పెళ్లికాలేదుగా! మా శాంతిని చేసుకుంటావేమిటి?'' అంది వేళాకోళం చేస్తూ.

అక్కడే నిలబడి ఉన్న శాంతి ''ఛీ... పో! అమ్మా'' అని ఇంకో గదిలోకి వెళ్లిపోయింది.

''ఆ రోజు వచ్చిన వాడిని మళ్లీ రానే లేదు.



ఆర్టీసి

రిక్షాడ్రైవర్లందరూ బస్ రేటుకే రిక్షాలను నడపాలని నిశ్చయించుకున్నారు.

పెద్దమనిషి దగ్గరికెళ్లి రిక్షా వాడు అడిగాడు.

''రండి సార్. బస్ పైసలకే రిక్షా. ఎక్కడికెళ్లాలి?''


''రైల్ స్టేషన్'' ఎక్కి చెప్పాడు. స్టేషన్ దగ్గర దిగి వెళ్లిపోతున్న ఆయన్ని చూసి నివ్వెరపోతూ అడిగాడు—

''బస్ చార్జి అయినా ఇవ్వటం లేదేం సార్?''

వెంటనే ఆ వ్యక్తి బస్‌పాస్ జేబులోంచి తీసి చూపించాడు నవ్వుతూ.

—మధ్యాహ్నపు లీలానంద సుబ్రహ్మణ్యస్వామి
(విశాఖపట్నం)

చీరలు



వెళ్లిపోతూ మళ్లీ ఇప్పుడు కనిపిస్తున్నావ్!'' అంది విష్ఫారాలాడుతూ.

"ఖాళీ ఏది! రోజూ నర్సింగ్ హోమ్ కెళ్లి మాస్టార్ని చూడ్డం. ఇంకో మూడు నాలుగురోజుల్లో మాట్లాడగలరట.''

కొబ్బరి పచ్చడి వేస్తున్న సీత నా మాట విని ఆగిపోయింది.

''నువ్వు ఎవరి సంగతి మాట్లాడుతుంట?'' ఆశ్చర్యంగా అడిగింది.

''మన లెక్కల మాస్టారి గురించి'' అన్నాను.

''ఆయన్ను నిన్న చూశాను. మార్కెట్లో కూరలు కొంటూ కనపడ్డారు? నీ గురించి చెప్పాను. గుర్తుకొచ్చావని చెప్పారు. ఆయన నర్సింగ్‌హోమ్‌లో ఉండటమేమిటి?''

''మేస్టార్ని నిన్న చూశావా? అదీ మార్కెట్లో?''

''అవును''

''కొడుకులు నర్సింగ్ హోమ్‌లో చేర్పించి వెళ్లిపోయారట. ఆ బెంగతోఆయన కృశించిపోతూ వుంటే నే వెళ్లాను. ఆయన ఆరోగ్యం బాగుపడిందని నర్సు చెప్పింది.''

''కొంపదీసి నువ్వు నల్లేరువారి వీధి వెళ్లావా?''

''అవును. అక్కడే కదా ఆయనుండేది''

''కాదు అక్కడనుంచి మారిపోయారు. ఆయనింట్లోకి ఇంకో మేష్టారెవరైనా వచ్చివుండొచ్చు. ఈ మధ్యన ప్రతీవాళ్లు ''గురూగారూ! మాష్టారూ'' అంటూంటారు. అవతలి మనిషి ఉపాధ్యాయుడా కాదా అన్న ప్రశ్న ఉండదు అప్పుడు. ఆయన ఇంకెవరో?'

ఆ తర్వాత సీత ఏదో మాట్లాడుతూనే ఉంది. అన్యాపదేశంగా ఊకొట్టానేగాని నా మనసులో ఒకటే ప్రశ్న.

విమలా నర్సింగ్ హోమ్‌లో ఈ ముసలాయన ఎవరు?

** ** **

నర్సింగ్ హోమ్ వెళ్లేసరికి నారాయణగారు నిద్రపోతున్నారు. ప్రశాంతంగా ఉన్న ఆయన ముఖం చూసి నాకు జాలేసింది. ఈయన మా ఉపాధ్యాయుడు కాదు. ముక్కు మొఖం తెలీని మనిషి రోజూ వచ్చి తన్ని చూస్తుంటే పొంగిపోయాడు.

మంచం ప్రక్కనున్న బల్లమీద పటికబెల్లం పాకెట్ పెడుతూంటే ఆయన లేచాడు. నన్ను చూసిన ఆయన ముఖం విప్పారింది. నన్ను కూర్చోమని సంజ్ఞచేశాడు.

నేను వెళ్లిపోతున్నట్టు చెప్పాను. ఇన్నాళ్లూ అనుకున్నట్టు ఆయన శిష్యుడ్ని కానని చెప్పాను. ఇక్కడున్న నాలుగు రోజుల్లో ఏదో బంధం మీ ముందుకు తీసుకువచ్చిందని చెప్పాను.

నర్సింగ్‌హోమ్ బయటకు వస్తూ ఆయన ముఖం చూశాను. అమావాస్యనాటి చీకటుంది ఆ ముఖంలో. దెబ్బతిన్నట్టు, మోసపోయినట్టు భావముంది ఆయన కన్నుల్లో.

అసలు విషయం నర్సు తర్వాత చెప్పింది.

ఆయనకు బాగా వినబడుతోంది.

మర్నాడు సర్వే రికార్డు తీసుకుని కట్టకట్టి సూట్‌కేసులో పెట్టుకుని బస్సు స్టాండుకు బయలుదేరాను.

మళ్లీ ఈ వూరికి ఎప్పుడు రానడమో!

చివరికి నేను చూడాలనుకున్న మనిషిని చూడలేకపోయాను. మనమ్మపడ్డ గందరగోళంలో మేష్టారి చిరునామా సీతను అడగలేదు. ఇంకో సంగతి గుర్తుకొచ్చింది. మా మేష్టారి పేరు నారాయణ కాదు. అనంతయ్య.

విమలా నర్సింగ్ హోమ్ బస్సు స్టాండుకు కనిపిస్తోంది. యధాలాపంగా చూసి ఉలిక్కిపడ్డాను.

టాక్సీలో శవాన్నొదాన్ని ఎక్కిస్తున్నారు. టాక్సీ ముందు నిలబడి ఉన్నాడొకడు. చిరాగ్గా ముఖం మొహం చిటపట లాడుతోంది. నారాయణగారి మూడో కొడుకు. ముగ్గురిలోకీ దయాదాక్షిణ్యాలు 'ఎక్కువ' ఉన్నవాడు.

గబగబా నడిచి నర్సింగ్‌హోమ్‌కి వెళ్లాను. డాక్టరు నన్ను గుర్తుపట్టాడు.

''ఎగైన్ సంథింగ్ అబ్సర్డ్. ఈ నాలుగు రోజుల్లో ఎంత వేగంగా కోలుకున్నాడో అంతవేగంగానూ ''సింక్'' అయిపోయాడు. క్షణాల్లో ప్రాణవాయువు లాగేసింది.''

దీనికి కారణం నాకు తెలుసు. నేస్తం కాని నేస్తం అని నన్ను గుర్తుపట్టడమే. ఇన్నాళ్లూ తన గురించి తపించే మనిషి ఒకడున్నాడనే భావనే ఆయన ప్రాణాన్ని చిగురింపజేసింది. అది బూటకమని తెలిసిన మరుక్షణం ఆ చిగురు అంతరించిపోయింది.

బస్సు హారన్ మ్రోగుతోంది.

నే వెళ్లవలసిన బస్సు సిద్ధంగా ఉంది. *

